మార్మోగిన సాయి నామస్మరణ



సాయి రథోత్సవానికి హారతి ఇస్తున్న ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే : అనకాపల్లి జిల్లా శ్రీసత్యసాయి బాబా భక్తులు మూడు వేల మంది పర్తియాత్ర పేరుతో పుట్టపర్తికి బుధవారం చేరుకున్నారు. ఆ జిల్లాలో వివిధ సామాజిక సేవా చేపట్టి మహాసమాధి దర్శనార్థం వచ్చారు. రాత్రి హనుమాన్ కూడలిలో మహానగర సంకీర్తన నిర్వహించారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సతీమణి హిమవాహిని రథోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణ పుర వీధుల్లో భక్తులు సాయినామాన్ని కీర్తిస్తూ రథోత్సవం ముందు నడిచారు. భజనలు, సంప్రదాయ నృత్యాలు, కోలాటం ప్రదర్శించారు. భక్తుల సాయి నామస్మరణతో పుట్టపర్తి మార్మోగింది.

★ సాయికుల్వంత్ మందిరంలో అనకాపల్లి భక్త బృందం సత్యసాయిని కీర్తిస్తూ అద్భుతంగా సంగీత కచేరి నిర్వహించారు. అనకాపల్లి జిల్లా భక్తులు రెండు రోజుల పాటు సత్య సాయి సన్నిధిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రీసర్వేపై అనుమానాలు తీర్చండి

పుట్టపర్తి: జిల్లాలో జరుగుతున్న రీసర్వే గ్రామసభల్లో రైతులకు ఉన్న అభ్యంతరాలను స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని జేసీ అభిషేక్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్ నుంచి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామసభలపై సమీక్షించారు. రైతుల వద్ద నున్న రికార్డుల ప్రకారం కాకుండా ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం, సర్వే తర్వాత నమోదు చేసిన విస్తీర్ణాలను సరి చూసుకునేలా రైతుల అనుమానాలను రెవెన్యూ, సర్వే అధికారులు నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కనగానపల్లి, సీకేపల్లి, ముదిగుబ్బ తదితర మండలాల్లో సర్వేయర్లు తీరు మెరుగు పరచుకోవాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, మహేశ్, శర్మ, సర్వే అధికారి విజయశాంతి పాల్గొన్నారు.




లక్ష్మయ్యకు చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఐఏఎస్ అకాడమీకి
రూ.5 లక్షల విరాళం

ధర్మవరం, న్యూస్‌టుడే : సివిల్స్ శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు వసతి కోసం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.5 లక్షల విరాళం చెక్కును ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ లక్ష్మయ్యకు బుధవారం విజయవాడలో అందజేశారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, దిల్లీకి చెందిన లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సివిల్స్ శిక్షణకు ప్రవేశపరీక్ష నిర్వహించారు. 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. రెండు సంవత్సరాలపాటు వీరికి హైదరాబాద్‌లో ఉచిత వసతితో కూడిన శిక్షణ అందించనున్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ తరపున మంత్రి విరాళం ఇచ్చారు. ధర్మవరం ప్రాంత విద్యార్థుల భవిష్యత్ కోసం ఈ ప్రయత్నం చేశామని విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు లభించేలా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదం అంచున చెరువులు



- ప్రధాన కట్టలు, షట్టర్లు బలహీనం
- చిన్న వర్షాలకే గండ్లు, రంధ్రాలు
- ఐదేళ్ల నిర్వహణ లోపమే కారణం

కదిరి, జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'గ్రామ సంపద'గా భావించే చెరువులు ప్రమాదం అంచున కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నచిన్న వానలకే వణుకుతున్నాయి. ఎక్కడికక్కడ రంధ్రాలు, గండ్లు పడటమే కాదు.. ప్రధాన కట్టలు సైతం తెగిపోయే పరిస్థితులు తలెత్తాయి. సోమవారం అర్ధరాత్రి కురిసిన వానలకే కనగానపల్లి, బండమీదపల్లి చెరువుల కట్టలు తెగిపోవడమే నిలువెత్తు నిదర్శనం. వీటి మూలంగా అనంత సాగరంవైపు వచ్చే పండమేరు వంక ఉగ్రరూపం దాల్చి.. అనంత నగర శివారుకాలనీలు జలమయమయ్యాయి. వందలాది కుటుంబాలు నీటి దిగ్బంధంలో చిక్కుకుని చిగురుటాకుల్లా వణికిపోయాయి. గడిచిన ఐదేళ్లూ వైకాపా ప్రభుత్వం గ్రామ సంపదపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడమే ప్రధాన కారణం. చెరువుల నిర్వహణ, మరమ్మతులకు నయాపైసా నిధులు ఇవ్వలేదు. సరికదా.. పూర్తిగా నిర్వీర్యం చేసింది. దాని ఫలితమే ఇప్పుడీ దుస్థితి. కరవు ప్రాంతంగా ముద్రపడిన ఉమ్మడి అనంత జిల్లాలో ఈదఫా ఆశించిన మేర వరుణుడు కరుణించాడు. నిర్దేశిత వర్షపాతం కంటే రెట్టింపు స్థాయిలో వాన కురిసింది. దీంతో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. ఎక్కడికక్కడ చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఈ నీటిని సంరక్షించే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. గండ్లు, రంధ్రాలు పడకుండా ముందస్తు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దిశగా జలవనరుల ఇంజినీర్లు తగిన శ్రద్ధ చూపకపోతే గ్రామ ప్రయోజనాలు తీర్చే నీరంతా వృథా అయ్యే పరిస్థితి ఉంటుంది.


క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి అవసరం

అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో చాలాచోట్ల చెరువులకు రంధ్రాలు, గండ్లు పడ్డాయి. చెరువుల ప్రధాన కట్టలు, షట్టర్లు, తూములు.. వంటి వాటికి సత్వరమే మరమ్మతులు అవసరం. శింగనమల చెరువు షట్టర్ పైకి ఎత్తితే కిందకు దిగని దుస్థితి. గతంలో ఇదే సమస్య ఎదురైంది. ఇప్పటికే కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి, శెట్టూరు మండలం ములకలేడు, కుందుర్పి మండలం రుద్రంపల్లి, గుత్తి మండలం జక్కలచెరువు, పామిడి మండలం అనుంపల్లి, రాయదుర్గం మండలం డి.కొండాపురం, బొమ్మక్కపల్లి, బ్రహ్మసముద్రం మండలం సంత్‌కొండాపురం, పోలేపల్లి, మామిడూరుకుంట, కుచ్చుబాయికుంట.. వంటి చెరువులకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో అనేక చెరువులకు ఇదే తరహా రంధ్రాలు, గండ్లు పడ్డాయి. వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయకపోతే నీరంతా వృథా అయ్యే పరిస్థితి తలెత్తనుంది. జలవనరులశాఖ మాత్రం రంధ్రాలు, గండ్ల వివరాలను దాచిపెడుతోంది. దీనివల్ల మేలు కంటే.. కీడే ఎక్కువ జరగనుంది.

సత్వరమే మరమ్మతులు

- గారపాటి విశ్వనాథ్‌రెడ్డి, ఎస్‌ఈ, జలవనరుల శాఖ

చెరువులపై పూర్తి నిఘా ఉంచాం. ఎక్కడా ఏ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చాలా చెరువులు నిండి మరువ పారాయి. చిన్నచిన్న మరమ్మతులు సత్వరమే చేస్తున్నాం. కలెక్టర్ కూడా తగిన ఆదేశాలు ఇచ్చారు. కంపలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



ఉమ్మడి అనంత జిల్లాలో చెరువుల వివరాలు

అంశం	అనంత	శ్రీసత్యసాయి	మొత్తం
చెరువులు	301	1186	1487
ఆయకట్టు(ఎకరాలు)	39,044	83,486	1,22,530
నీటి సామర్థ్యం(టీఎంసీ)	7.655	15.324	22.979
ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీ)	4.138	6.967	11.105



నిండుగా అనంత సాగరం చెరువు

దీపావళి నుంచే వెలుగులు

- ➤ నాలుగు నెలలకొక సిలిండర్ పంపిణీ
- ➤ ఉమ్మడి జిల్లాలో 12,08,293 కుటుంబాలకు లబ్ధి



పుట్టపర్తి, రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీని దీపావళి పండగ రోజు నుంచే శ్రీకారం చుట్టనుంది. ఈ మేరకు బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకానికి ఆమోదం తెలిపింది. ఈనెల 24 నుంచి సిలిండర్ బుకింగ్ చేసుకోవచ్చని.. 31వ తేదీ నుంచి ఉచిత గ్యాస్ అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ఒకేసారి మూడు సిలిండర్లు కాకుండా నాలుగు నెలలకొకటి చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. సిలిండర్‌కు డబ్బులు చెల్లిస్తే.. 48 గంటల్లో తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లోకి రాయితీ సొమ్ము జమ చేస్తారు. మహిళలకు ఆర్థిక భారం తగ్గింపు, జీవన ప్రమాణాలు పెంచేందుకు వీటిని పంపిణీ చేయనున్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు అందించడమే కాకుండా మహిళల్లో ఆనందం నింపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం.

ఏడాదికి రూ.315.18 కోట్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 12,54,911 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లకార్డుదారుల ప్రాతిపదికన తీసుకుంటే 12,08,293 కుటుంబాలకు అర్హత ఉంది. వీరందరికీ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇవ్వాలంటే ప్రభుత్వంపై ఏడాదికి మొత్తం రూ.315.18 కోట్లు చొప్పున ఐదేళ్లకు మొత్తం రూ.1,576 కోట్ల భారం పడుతుంది. ప్రస్తుతం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.869.50. ఇందులో రూ.50 రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికే జమ అవుతుంది. మిగిలిన రూ.819.50 లబ్ధిదారుల ఖాతాల్లోకి 48 గంటల్లో జమ చేస్తారు. వినియోగదారు సొమ్ము చెల్లిస్తే.. తర్వాత మొత్తం పారదర్శకంగా రాయితీ సొమ్ము ఖాతాల్లో జమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీపై మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని శ్రీసత్యసాయి జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

అనర్హులను తొలగించేందుకు ఈ-కేవైసీ

ఈ పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్ నంబరుకు, ఆధార్ నంబరు అనుసంధానం చేసుకోవాలని (ఈకేవైసీ) గ్యాస్ డీలర్లు వినియోగదారులను ఒత్తిడి చేస్తున్నారు. గత 2023 నవంబరు నుంచి ఆయా కంపెనీలు గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఈకేవైసీకి శ్రీకారం చుట్టాయి. వినియోగదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పటి వరకు కేవలం 50 శాతం మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని ఆయిల్ కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. కానీ, 1999లో అప్పటి తెదేపా ప్రభుత్వం దీపం పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 4,09,764 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ ఉన్న వేలాదిమంది వినియోగదారులు చనిపోయారని, వారి పేరు మీదున్న కనెక్షన్లు ఇతరులు వాడుకుంటున్నట్లు కంపెనీలు గుర్తించాయి. వీటితోపాటు 7,48,218 సాధారణ కనెక్షన్లు ఉన్నాయి. మరో 96,929 ఉజ్వల, ఇతర కంపెనీలకు సంబంధించినవి ఉన్నాయి. దశాబ్దాల కిందటే లక్షలాది మంది కనెక్షన్లు తీసుకున్నారు. వాటిలో వేలమంది చనిపోయారు. మృతుల పేరుతో ఉన్న కనెక్షన్లు తొలగించేందుకే ఈకేవైసీ చేయిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఎక్కడ కనెక్షన్ తొలగిస్తారోనన్న భయం అనర్హుల్లో వెంటాడుతోంది. కాగా.. ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీకి, ఈకేవైసీకి ఎలాంటి సంబంధం లేదని ఆయిల్ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.


రూటా జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు



సమీవుల్లా, నిసారుల్లా

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) శ్రీసత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఫైరోజ్‌అహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా సమీవుల్లా (తలమర్ల పాఠశాల), ప్రధాన కార్యదర్శిగా నిసారుల్లా (పరిగి), గౌరవాధ్యక్షులుగా ఫజ్లేకరీం(పెనుకొండ), అసోసియేట్ అధ్యక్షులు, అదనపు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శి తదితర విభాగాలకు నూర్‌షరీఫ్, మసీవుల్లా, అష్ఫాక్, అనీస్‌అహమ్మద్, మొహిద్దీన్, జబీవుల్లా, నాసిరుల్లా, సైపుద్దీన్, మహమ్మద్ యాకూబ్, ఇర్ఫాన్ అహమ్మద్, అబ్దుల్ రజాక్, వసీంఅహమ్మద్, మహమ్మద్ ఈదుల్లా, ఖాజావలిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహ్మద్, పరిశీలకులుగా రూటా రాష్ట్ర కన్వీనర్ ఆరిఫ్‌అమీని హాజరైనట్లు తెలిపారు.

చిత్రావతికి జలహారం



తాడిమర్రి, న్యూస్‌టుడే : మండల సరిహద్దులోని చిత్రావతి జలాశయం వరదనీటితో జలకళను సంతరించుకుంది. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతూ చిత్రావతి కాలువ ద్వారా వరద నీరు జలాశయంలోకి చేరుతోంది. దీంతో జలాశయం నిండుకుండలా కనబడుతోంది. బుధవారం సీబీఆర్ అధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి జలాశయంలోకి 12,000 క్యూసెక్కుల నీరు చేరిందన్నారు. జలాశయం సామర్థ్యం 10 టీఎంసీలుగా ప్రస్తుతం 8.3 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే వరదలకు కారణం: ఎమ్మెల్యే సునీత



తెగిపోయిన బండమీదపల్లి చెరువు కట్టను పరిశీలిస్తున్న సునీత, నాయకులు, అధికారులు

రాప్తాడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు మునగడానికి కారణమైందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కురిసిన భారీ వర్షాలకు రాప్తాడు మండలం బండమీదపల్లి చెరువు తెగిపోయింది. బుధవారం పరిటాల సునీత అధికారులతో కలసి చెరువును పరిశీలించారు. చెరువు కింద ముంపునకు గురైన వరి, చీనీ పంటలు, కోతకు గురైనా పంట పొలాలను పరిశీలించారు. బాధిత రైతుల కష్టాలు విన్నారు. గత ప్రభుత్వంలో ఏరోజూ చెరువులకు మరమ్మతులు గానీ, కాలువల స్థితిగతులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితిని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లామని ఒకసారి జిల్లాకు వచ్చి పంటలను పరిశీలించాలని కోరాగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెరువులు, కాలువలు తెగిపోయిన అంశాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి నివేదిక తెప్పించుకున్నారన్నారు. వాటి మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రతి రైతుకు పరిహారం అందే విధంగా చొరవ తీసుకుంటామని చెరువులకు, కాలువలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేస్తామని సునీత తెలిపారు.


మరమ్మతులకు రూ.2.55 కోట్లతో ప్రతిపాదనలు

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వివిధ జాతీయ రహదారులు, చెరువుల పటిష్ఠపరచడానికి రూ.2.55 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు కలెక్టర్ టీఎస్‌చేతన్ తెలిపారు. బుధవారం పుట్టపర్తిలోని కలెక్టరరేట్‌లో ఇటీవల కురిసన వర్షాల వల్ల జరిగిన నష్టంపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 23 వరకు కురిసిన భారీ వర్షాలకు మడకశిర బ్రాంచ్ కెనాల్ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా 8 చోట్ల గండ్లు పడిందని, వాటి మరమ్మతులు, చెరువుల పటిష్ఠ పరచడానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. జిల్లాలో పంటలు 1,274, ఉద్యాన తోటలు 54.21 హెక్టార్లలో నష్టం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 ఇళ్లు దెబ్బతిన్నాయని, పశువులు, గొర్రెలు, మేకలు మృతి చెందాయని వివరించారు. పంచాయతీ రాజ్ రోడ్లు 516 కిలోమీటర్లు దెబ్బతిందని, రూ.1.53 కోట్లు నష్టం జరిగిందన్నారు. ధర్మవరంలో 372 చేనేత మగ్గాలు వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. రామగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాక్షికంగా దెబ్బతింది. విద్యుత్తు స్తంభాలు పడిపోవడం వల్ల రూ.2 లక్షలు నష్టం జరిగిందని తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు తెలిపారు.

చేనేతలకు చేయూత

100 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ అమలు



ధర్మవరం, అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తర్వాత ఎక్కువమంది జీవనాధారం చేనేత పరిశ్రమపైనే. గత వైకాపా ప్రభుత్వం చేనేతలకు వచ్చే రాయితీ పథకాలు తొలగించి 'నేతన్న నేస్తం' పేరుతో సంవత్సరానికి రూ.24 వేలు ఖాతాల్లో జమ చేసి చేతులు దులుపుకొంది. రాజకీయ పలుకుబడితో అనర్హులకు ఎక్కువ శాతం ఇచ్చారనే ఆరోపణలతో గతంలో చేనేత సంఘాలు ఆందోళనలు చేశాయి. ఉచిత కరెంట్ ఇస్తామన్న వైకాపా మొండిచేయి చూపింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 100 యూనిట్ల లోపు కరెంట్ బిల్లు ఉన్నవారు ఛార్జీలు చెల్లించాల్సిన పనిలేదని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే హామీని అమలు చేయడంపై చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో చేనేత కుటుంబాలు	45,274
పనిచేస్తున్న మొత్తం మగ్గాలు	37,500
ఉచిత విద్యుత్తుకు దరఖాస్తు చేసుకున్నవారు	6,892 మంది
కరెంట్ బిల్లు రాయితీ పొందిన అర్హులు	4,892 మంది

ఎలా దరఖాస్తు చేసుకోవాలి..

చేనేత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజురు చేసింది. వాటితోపాటు, ఆధార్‌కార్డు, 100 యూనిట్ల లోపు వచ్చిన కరెంట్ బిల్లు, చేనేత కార్మికుడిగా ఉన్న ఫొటోతో సమీపంలోని సచివాలయానికి లేదా విద్యుత్తు కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు చేసిన రెండు మూడు రోజుల్లో సంబంధిత విద్యుత్తుశాఖ లైన్‌మ్యాన్ పరిశీలనకు వస్తారు. విచారించి అర్హులను గుర్తిస్తారు. 100 యూనిట్లకు లోపు ఉంటేనే ఉచిత కరెంట్ అమలు అవుతుంది. 101 యూనిట్లు వచ్చినా ఉచితం అమలు కాదు. సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్న చేనేతలకు ఇప్పుడు బిల్లులు సున్నా రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



మాట నిలుపుకొన్న సీఎం - జూజారు ఈశ్వరయ్య, నేసేపేట, ధర్మవరం

చేనేత కార్మికుల ఇళ్లకు ఉచిత విద్యుత్తు ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట నిలుపుకొన్నారు. గత నెల విద్యుత్తు కార్యాలయంలో ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తు చేశాను. పరిశీలించిన విద్యుత్తుశాఖ అధికారులు ఆమోదం తెలిపారు. ఇదివరకు నెలకు రూ.300 నుంచి రూ.350 వరకు బిల్లు వచ్చేది. ఈ నెల జీరో వచ్చింది. ఆర్థికభారం తప్పడంతో ఆనందంగా ఉంది.



అండగా కూటమి ప్రభుత్వం

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగాను అన్ని విధాలుగా నాశనం చేసింది. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ప్రతినెలా చేనేతలకు ఆదాయం సమకూర్చేలా 11 సంక్షేమ పథకాలను అమలు చేసేది. ఈసారి ఉచిత కరెంట్ ఇచ్చి మరింత భరోసా కల్పించారు.

- పోతుల లక్ష్మీనరసింహులు, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్

ఏమ్మా.. అంగన్‌వాడీ కేంద్రాలకు ఏ బియ్యం ఇస్తారు!



ప్రశ్నలు అడుగుతున్న జేసీ శివనారాయణ శర్మ, పీడీ శ్రీదేవి, డీఏఓ విజయలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌ఓ సుజాత, ఆర్డీఓ వసంతబాబు, తదితరులు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఏమ్మా... అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలాంటి బియ్యం సరఫరా చేస్తారో తెలుసా. బిడ్డ పుట్టగానే వ్యాక్సిన్ ఏమేం ఇస్తారో చెప్పగలవా.. అంటూ అభ్యర్థినులను అడిగారు. బుధవారం అనంత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో అనంత అర్బన్, అనంత గ్రామీణం, నార్పల, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ (జేసీ) శివనారాయణ శర్మ, ఆర్డీఓ వసంతబాబు, ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి, ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి విజయలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, తదితరుల సమక్షంలో ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. పౌష్టికాహారం, వ్యాక్సినేషన్, ఆహార సామగ్రి, పిల్లల బరువు, ఎత్తు.. వంటి అంశాలపై ప్రశ్నలు అడిగారు. నిర్దేశిత ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకురాలు కేడర్లకు సంబంధించి మొత్తం 49 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అన్ని పోస్టులకు 161 మంది దరఖాస్తు చేసుకోగా.. 139 మంది హాజరయ్యారు. తక్కిన 22 మంది రాలేదు.

అక్కాచెల్లెళ్లు.. క్రికెట్‌లో దూకుడు

జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : తండ్రి ప్రోత్సాహంతో సరదాగా బ్యాట్ పట్టిన ఆ ఇద్దరు అమ్మాయిలు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో రాణిస్తున్నారు. అక్కా బ్యాట్స్‌ఉమెన్‌గా, చెల్లి బ్యాట్స్‌మెన్, బౌలర్‌గా ప్రతిభ కనబరుస్తున్నారు. వారే గుంతకల్లు పట్టణంలో నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన ధనుంజయ్య, లీలా దంపతుల కుమార్తెలు అమూల్య, నందిని. వీరి విజయ గాథపై స్ఫూర్తిదాయక కథనం.

ఆర్డీటీ సహకారం

అమూల్య ఇంటర్ మొదటి సంవత్సరం, చెల్లి నందిని సరోజినీ నాయుడు పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరికి ఆరేళ్ల కిందట బాలికలకు క్రికెట్ అంటే తెలియదు. పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. క్రికెట్ బ్యాట్ పట్టే ఆడే విధానం గురించి పిల్లలకు మెలకువలు నేర్పించారు. ఆర్డీటీ సంస్థ ప్రోత్సాహంతో 2019 ఏడాది నుంచి వేసవి శిబిరాల్లో శిక్షకుల సారథ్యంలో ప్రాథమిక స్కూల్ నుంచి శిక్షణ తీసుకుంటున్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ క్రికెట్‌లో దూసుకెళ్తున్నారు.

బ్యాట్స్‌ఉమెన్, వికెట్ కీపర్‌గా అమూల్య

2019 నుంచి ఆర్డీటీ సంస్థ నిర్వహిస్తున్న వేసవి శిబిరాల్లో అమూల్య పాల్గొంటూ సత్తా చాటుతోంది. 2022లో అనంత ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల్లో బ్యాట్స్‌ఉమెన్, వికెట్ కీపర్‌గా రాణించింది. 2024లో నెల్లూరు జిల్లా, వెంకటగిరిలో అండర్-19 విభాగంలో సౌత్ జోన్ పోటీలు జరిగాయి. కర్నూలు జట్టుపై 51 పరుగులు, చిత్తూరు జట్టుపై 44 పరుగులు చేసి ప్రతిభ చాటింది.

● 2023-24లో అనంతపురం జిల్లాలో ఏపీఎల్ టోర్నీ జరిగింది. ఎనిమిది మ్యాచ్‌లు ఆడి మూడు అర్ధ సెంచరీలు చేసింది. రెండు రన్‌అవుట్లు, రెండు క్యాచ్‌లు, రెండు స్టంప్ అవుట్లు చేసింది. సౌత్ జోన్, జిల్లా, మండల, స్కూల్‌గేమ్స్ పోటీల్లో 65 మ్యాచ్‌ల్లో పాల్గొని మొత్తం వెయ్యి పరుగులతో దూసుకెళ్లింది.



అమూల్య నందిని

ఆల్‌రౌండర్‌గా నందిని

● నందిని అండర్-15 విభాగంలో బ్యాట్స్‌ఉమెన్, బెస్ట్ బౌలర్‌గా రాణిస్తోంది.

● 2022-23లో ఏపీఎల్ టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా దూసుకెళ్లింది.

● 2023-24లో ఏపీఎల్ టోర్నీలో ఆరు మ్యాచ్‌లు ఆడి 12 వికెట్లు పడగొట్టి, ఐదు క్యాచ్‌లు పట్టింది. 272 పరుగులు సాధించింది.

● 2023-24లో గుజరాత్ రాష్ట్రంలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఒక మ్యాచ్‌లో రెండు వికెట్లు, మరో మ్యాచ్‌లో ఒక వికెట్ తీసింది. ఇప్పటి వరకు 69 మ్యాచ్‌ల్లో పాల్గొని 979 పరుగులు సాధించింది. 74వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా సత్తా చాటడం విశేషం.

తుంగభద్ర ఆధునికీకరణకు నిధులు మంజూరు

రాయదుర్గం, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలవ ఆధునికీకరణ పనులకు రూ.35 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ర.భ. అతిథి గృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. హెచ్ఎల్ఎంసీ కింద ఈ నిధులతో 11 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలోనే 9 పనులు ఉన్నాయన్నారు. కణేకల్లు చెరువుకు అవుట్ పాల్ గేట్లు అమర్చడం, 105వ కి.మీ. నుంచి వివిధ ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న కాలవ గట్లకు మరమ్మతులు, యూటీల మరమ్మతులు తదితర పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. వైకాపా పాలనలో హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేయటంతో ప్రధాన కాలువ దెబ్బతిని యూటీలు పైకి లేచాయని విమర్శించారు.

ప్రభుత్వ నర్సుల సంఘానికి కొత్త కార్యవర్గం



అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలను బుధవారం ఐఎంఏ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుని కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల్లో పోటీదారులతో గెలుపొందిన అభ్యర్థులను విజేతలుగా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ ప్రకటించారు. నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, వైస్‌ప్రెసిడెంట్ భానులత, కార్యదర్శి లత, కోశాధికారి సంధ్య అరుణమ్మతోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నారాయణస్వామి, శ్రీదేవి, ఆదిత్యాదేవి, నాగమణి, అరుణలు ఉన్నారు.

వాలీబాల్ పోటీల్లో చిత్తూరు, గుంటూరు జట్లకు విజయం



బాలుర విభాగంలో విజేతగా నిలిచి కప్పు అందుకుంటున్న చిత్తూరు జట్టు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-17 వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు, బాలికల విభాగంలో గుంటూరు జట్టు విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన జట్లకు ఎంటెక్ ఏహెచ్ గంగప్ప, హెచ్ఎం సుధామణి, టోర్నమెంట్ పరిశీలకులు రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేశ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మురార్జీయాదవ్, అతిథులు పల్లె లక్ష్మీకుమార్, బండారు బాలాజీ, పామిశెట్టిశేఖర్, మంచాల మారుతి, మంజునాథ్, ఏసీ నాగరాజు, ఓబులేసు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, రామాంజనేయులు, ప్రకాశ్‌రెడ్డి కప్‌లు అందించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో గుంటూరు, చిత్తూరు జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఉత్కంఠంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ, విశాఖపట్నం తృతీయ, శ్రీకాకుళం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు, గుంటూరు జిల్లా జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ రెండు జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో గుంటూరు జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు ద్వితీయ, అనంతపురం తృతీయ, ప్రకాశం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు అతిథులు కప్‌లు, పతకాలు అందించారు.

తుదిదశ పోటీలకు ఒడిశా జట్టు అర్హత



గోల్ కోసం తలపడిన లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్ జట్లు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ పోటీల్లో ఒడిశా జట్టు ఫైనల్ రౌండ్ పోటీలకు అర్హత సాధించింది. గ్రూప్-ఎఫ్‌లో ఒడిశా జట్టు అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ పోటీలకు దూసుకెళ్లింది. బుధవారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన చివరిరౌండ్ పోటీలో ఒడిశా జట్టు మధ్యప్రదేశ్ జట్టును 12-0 గోల్స్ తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ పోటీల్లో ఒడిశా జట్టు రెండు విజయాలు నమోదు చేయగా ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. పాయింట్ల ప్రకారం ఒడిశా జట్టు ఎఫ్-పూల్ నుంచి తుది రౌండ్ పోటీలకు చేరింది. ఒడిశా జట్టు ఆట ప్రథమార్ధంలో ఆరు, ద్వితీయార్ధంలో మరో ఆరు గోల్స్ నమోదు చేయడం విశేషం. మధ్యప్రదేశ్ జట్టు ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. మధ్యాహ్నం జరిగిన మరో పోటీలో అరుణాచల్ ప్రదేశ్ జట్టు లద్దాఖ్ జట్టును 2-0 గోల్స్ తేడాతో పోరాడి నెగ్గింది. గత ఐదు రోజులుగా జరిగిన ఈ పోటీలు బుధవారంతో ముగిశాయి.

పాతకక్షలతో తాడిపత్రిలో ఘర్షణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని గాంధీనగర్‌లో మంగళవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు వైకాపా వర్గీయుడు మహమ్మద్ గౌస్, తెదేపా వర్గీయుడు సాదిక్‌కు పాత కక్షలు ఉండేవని, మంగళవారం రాత్రి మహమ్మద్ గౌస్ ఓ పెళ్లికి వెళ్లి వస్తుండగా అన్నక్యాంటీన్ సమీపంలో సాదిక్ ఎదురు పడటంతో ఘర్షణ పడ్డారు. సాదిక్ స్నేహితులతో కలిసి మహమ్మద్ గౌస్‌ను కొట్టగా ఆయనకు గాయాలయ్యాయి. చికిత్స కోసం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం పెద్దాసుపత్రికి తరలించారు.

రైతులను కబళించిన మృత్యువు

పంట విక్రయించేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

ఆ రైతు అరుగాలం శ్రమించాడు. కంటికి రెప్పలా కాపాడుకున్న వేరుసెనగ పంటను కోతకోయించాడు. దిగుబడి ఆశాజనకంగా రావడంతో సంబరపడ్డాడు. వరుణ దేవుడి కరుణతో ఇక తన కష్టాలన్నీ తీరాయని కొండంత ఆశతో దిగుబడిని విక్రయించేందుకు మరో రైతుతో కలిసి బయలుదేరాడు. చక్కగా కబుర్లు చెప్పుకుంటూ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మృత్యుశకటం ఆ ఇద్దర్నీ బలితీసుకుంది. ఆ కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది.



నాగేశ్వరరెడ్డి



వెంకటరమణ

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలం పోతురాజుకాల్వ వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో సోదనపల్లికి చెందిన వెంకటరమణ(52), నాగేశ్వరరెడ్డి(54) మృతి చెందారు. వెంకటరమణ వేరుసెనగ పంటను కోత కోయించి స్వగ్రామం నుంచి నార్పలకు వేరుసెనగ కాయలను ఆటోలో పంపారు. తర్వాత మిత్రుడు నాగేశ్వరరెడ్డితో కలిసి ద్విచక్రవాహనంలో ఆటో వెనకాలే బయలుదేరారు. తాడిపత్రి-అనంతపురం జాతీయ రహదారి పైకి చేరుకోగానే వెనకవైపు నుంచి టిప్పర్ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న నాగేశ్వరరెడ్డిని 108 వాహనంలో తరలిస్తుండగా మృతి చెందారు. ఈఘటనపై సీఐ కౌలుట్లయ్య, ఎస్సై శంకర్‌చంద్ర కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దొంగ అరెస్టు.. బంగారు నగలు స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చోరీలకు పాల్పడే ఓ అంతర్‌జిల్లా దొంగను అనంతపురం గ్రామీణం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలను సీఐ శేఖర్ మీడియాకు వెల్లడించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన రంగస్వామి అలియాస్ రంగ అనేవ్యక్తి పగటివేళ తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తుడు. ఈ ఏడాది ఆగస్టులో అనంతపురం గ్రామీణంలోని సోములదొడ్డిలో ఒకే రోజు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితునిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో చోరీ చేసిన నగలను బ్యాంకులో కుదువ పెట్టడానికి నగరంలోకి వస్తుండగా సీఐ శేఖర్, ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 125 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

లోయలో పడిన ఆర్టీసీ బస్సు

● 20 మందికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు

● ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో ప్రమాదం



పులివెందుల సమీపంలో లోయలో పడిన ఆర్టీసీ బస్సు

పులివెందుల (వేంపల్లి), కదిరి, తలుపుల: వైఎస్ఆర్ జిల్లా పులివెందుల పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. పులివెందుల డిపో ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం కదిరి నుంచి పులివెందులకు వస్తోంది. పులివెందుల పట్టణ సమీపంలోని కదిరి మార్గంలోని డంపింగ్ యార్డు వద్దకు రాగా, ఎదురుగా రెండు లారీలు ఒకదానికొకటి దాటుకుని ప్రయత్నంలో చిన్నలారీ డ్రైవర్ ఆకస్మాత్తుగా ఆర్టీసీ బస్సుకు అడ్డొచ్చారు. ఊహించని పరిణామంతో ఆర్టీసీ డ్రైవర్ గంగిరెడ్డి బస్సును అదుపు చేసేందుకు ఎడమవైపు తిప్పగా సుమారు 40 అడుగుల లోయలో పడి పోయింది. బస్సులో 21 మంది వరకు ప్రయాణికులు ఉండగా, అంతా పులివెందుల, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందినవారే. ఘటనలో పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన షేక్ సాబీరున్నీసా, కదిరికి చెందిన దాదాపీర్, గాండ్లపెంట మండలం నర్సన్నగారిపల్లెకు చెందిన కదిరి నర్సింహులు, పులివెందులకు సిరిగిరెడ్డి థామస్‌రెడ్డి, తొండూరు మండలం కృష్ణంగారిపల్లెకు చెందిన గూడూరు రామసుబ్బారెడ్డి, కదిరి మండలం మెటుకుపల్లెకు చెందిన శ్రీదేవి, బస్సు కండక్టర్ సిరాజ్ మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని '108' వాహనంలో పులివెందుల ఆసుపత్రికి తరలించారు. థామస్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పులివెందుల ట్రాఫిక్, అర్బన్ సీఐలు హాజీ వల్లి, గంగనాథ్‌బాబు పరిశీలించారు. గాయపడినవారిని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తెదేపా సీనియర్ నేత మండల బాధ్యుడు జోగిరెడ్డి, పులివెందుల పురపాలక సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, తదితరులు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో బస్సు పల్టీలు కొడుతూ వెళ్లి నేలను తాకే సమయంలో యథాస్థితికి చేరడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, బోల్తా పడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హాజీవల్లీ తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

తెదేపా నాయకుడిపై వైకాపా వర్గీయుల దాడి



కాలికి గాయంతో కాటమయ్య

తాడిమర్రి, న్యూస్‌టుడే : మండలంలోని చిల్లవారిపల్లికి చెందిన తెదేపా నాయకుడు అంద్ర కాటమయ్యపై అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు నారాయణరెడ్డి వర్గీయులు దాడి చేశారు. బుధవారం బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వైకాపా హయాంలో చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం దేవాదాయ శాఖలో నిర్వహణలో ఉండేది. స్థానిక వైకాపా నాయకులు అధికారాన్ని ఉపయోగించి ఆలయాన్ని వారిలో ఆధీనంలోకి తీసుకుని, ఛైర్మన్‌గా నారాయణరెడ్డిని నియమించారు. దీనిపై స్థానిక తెదేపా నాయకులు ఆ పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు దృష్టికి తీసుకెళ్లి ఆలయ ఛైర్మన్‌గా వారిని తొలగించాలని కోరారు. ఈ విషయం వైకాపా నాయకులకు తెలిసింది. మంగళవారం రాత్రి గ్రామంలో ఒంటరిగా వెళ్తున్న కాటమయ్యపై నారాయణరెడ్డి, అతని అనుచరులు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో స్పృహ తప్పిపడిపోవడంతో బాధితుని బంధువులు వైద్య చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో నారాయణరెడ్డి, సోమిరెడ్డి, చిన్న ఓబిరెడ్డి, బాలిరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి పట్టివేత



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో ఈ నెల 11న అత్తా, కోడళ్లపై జరిగిన అత్యాచార ఘటన కేసులో నిందితుడు చాకలి శ్రీనివాసులు (20)ను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కేసుకు సంబంధించి ఇప్పటికే ఐదుగురు నిందితులను 48 గంటల్లోనే అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుడు చాకలి శ్రీనివాసుల కోసం హిందూపురం డీఎస్పీ కేవీ మహేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పూలకుంట గ్రామ శివారులో ఆదిరెడ్డి పొలం వద్ద అతన్ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసుతోపాటు హిందూపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో దోపిడీ, అక్రమ మద్యం కేసులతో పాటు అత్యాచార, దొంగతనం కేసుల్లోనూ శ్రీనివాసులు నిందితుడిగా ఉన్నాడని పేర్కొన్నారు. అత్యాచార కేసులో అరెస్ట్ అయిన నిందితుల వల్ల ఎవరైనా ప్రత్యక్షంగా అన్యాయానికి గురైన బాధితులు ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదుచేస్తే అలాంటి వారికి తగు న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.


ఆస్తి తగాదాలో తండ్రిని హతమార్చిన తనయుడు

యాడికి: తండ్రి అన్న మమకారం కూడా లేకుండా తనయుడే ఆయన్ను అతి కిరాతకంగా హత మార్చిన ఘటన యాడికిలో బుధవారం జరిగింది. ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన వివాదం కాస్త హత్యకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వీరన్నపల్లి గ్రామానికి చెందిన వడ్ర లక్ష్మీనారాయణ(48)కు ఇద్దరు భార్యలు. మద్యానికి బానిసగా మారిన లక్ష్మీనారాయణ ఇద్దరు భార్యలను వదిలి తాగుతూ జులాయి తిరుగుతుండేవాడు. యాడికిలోని వెంగమనాయుడు కాలనీలో మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తిక్ నివాసం ఉంటున్నారు. లక్ష్మీనారాయణ తల్లి నారాయణమ్మ పేరు మీద ఐదెకరాల పొలం ఉంది. ఆస్తి తగాదాపై కోర్టుకు సైతం వెళ్లారు. ఆస్తి అంతా తాగుడుకే కేటాయిస్తుండటంతో పలుమార్లు కుటుంబ సభ్యులు గొడవలు పడ్డారు. ఈక్రమంలో బుధవారం కుంటకట్ట సమీపంలో తారసపడిన తండ్రితో కుమారుడు ఆస్తి విషయంలో వాదనకు దిగాడు. అదికాస్త ఘర్షణకు దారి తీసింది. అక్కడే ఉన్న రాళ్లతో దాడి చేయడంతో తండ్రి కుప్పకూలిపోయాడు. ఆ వెంటనే కుమారుడు తనతోపాటు తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హతమార్చాడు.

యువకుడి ఆత్మహత్య

నల్లచెరువు(కదిరి), న్యూస్‌టుడే : నల్లచెరువుకు చెందిన వెంకటేశ్ (34) బుధవారం గ్రామ సమీపాన పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపిన మేరకు వివరాలు. అతను మద్యం వ్యసనానికి బానిసయ్యాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. కుమారుడి పరిస్థితిని చూసి సంసారం సక్రమంగా చేసుకోవాలని తల్లి మందలించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేశ్ నల్లచెరువులోని వేమన ఆలయానికి వెనుక భాగంలో పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హీటర్ తగిలి చిన్నారి మృతి



శ్రీవల్లి

కనగానపల్లి, న్యూస్‌టుడే: నీటిని కాచే హీటర్ తగిలి చిన్నారి మృత్యువాత పడిన విషాద ఘటన కనగానపల్లి మండలం చంద్రచార్లలో బుధవారం చోటుచేసుకుంది. చంద్రచార్లకు చెందిన నాగలీల, నరసింహులు దంపతుల కుమార్తె శ్రీవల్లి(10) అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. పాఠశాలకు సమయం అవుతోందని శ్రీ వల్లికి స్నానం చేయించడానికి ఇంట్లోని స్నానపు గదిలో ఒక బకెట్లో నీటిని నింపి అందులో హీటర్‌ను చిన్నారి తల్లి నాగలీల వేసింది. తన తల్లికి చెప్పకుండా స్విచ్ ఆఫ్ చేయకుండా హీటర్‌ను తీసే క్రమంలో అనుకోకుండా చేయికి తగలి విద్యుదాఘాతానికి ఆ చిన్నారి గురైంది. ఇంటిలో వారు గమనించి వైద్యం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

పైపులైన్ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం


ప్రిన్సిపల్‌కు నగదు అందజేస్తున్న తెదేపా నాయకులు

రొద్దం: స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మురుగు సమస్య పరిష్కరించేందుకు పైపులైన్ ఏర్పాటుకు తెదేపా యువ నాయకుడు హరీశ్ రూ.లక్ష విరాళం అందించారు. సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. బుధవారం తెదేపా సీనియర్ నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి పాఠశాల ప్రిన్సిపల్ అనితతో చర్చించి, నగదును అందజేశారు. తెదేపా మండల కన్వీనర్ నరహరి, నాయకులు శ్రీనాథ్‌చౌదరి, వీరాంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

చిలమత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమస్యలపై ఎలాంటి చర్చ లేకుండానే కేవలం 10నిమిషాల్లో ముగించారు. సమావేశానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీపీ మొదట కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మండలాభివృద్ధికి తెదేపా సహకరిస్తే తాము సహకరిస్తామని చెప్పారు. తనకు ఆరోగ్యం బాగోలేదని ఎంపీపీ వెళ్లిపోయారు. మండలంలో సమస్యలపై చర్చించక పోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ రమణమూర్తి, ఇన్‌ఛార్జి తహసీల్దార్ యానస్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు మంజునాథరెడ్డి, ఆదినారాయణ, కవిత, సానే శిల్పారెడ్డి, ఇర్షాద్‌బేగం, సర్పంచులు తిరుమలేశ్‌గౌడ్, మురళీమోహన్, జయశంకర్‌రెడ్డి, నీలాబాయి, లక్ష్మిరెడ్డి, సంధ్యారాణి పాల్గొన్నారు.

పురంలో రెక్కీ కలకలం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో ఆదివారం సాయంత్రం కొంత మంది యువకులు రాడ్లు, కత్తులతో ద్విచక్ర వాహనాల్లో వచ్చి డీలర్ కాలనీకి వెళ్లే దారుల్లో రెక్కీ నిర్వహించడం కలకలం రేపింది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లటంతో డీఎస్పీ మహేశ్ అప్రమత్తమయ్యారు. సీసీ ఫుటేజీల్లో వారిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ప్రాంతంలో నివాసం ఉన్న ఓ వైద్యుడు తన భార్యను వేధిస్తుండటంతో ఆమె తరఫున మాట్లాడేందుకు ఇలా వచ్చినట్లు వారు పోలీసులకు తెలిపారు. సమస్యలను తమ దృష్టికి తేవాలని, ఇలా చేయటం చట్టవిరుద్ధమని పోలీసులు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వైద్యుడు, ఆతని భార్యను పిలిపించి విచారించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లేపాక్షి, న్యూస్‌టుడే: కర్ణాటక సరిహద్దు మైదుగోళం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం డి.పాళ్యంకు చెందిన భార్యభర్తలు రియాజ్, హసీనా(45) ద్విచక్ర వాహనంలో మైదుగోళానికి వస్తున్నారు. ఈ క్రమంలో వీరిని ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో హసీనా అక్కడికక్కడే మృతి చెందగా రియాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

హిందూపురం: భార్య కాపురానికి రాలేదని మడకశిర మండలం సి.చర్లోపల్లికి చెందిన శ్రీరాములు(35) ఈనెల 12న పట్టణంలోని చిన్న మార్కెట్‌లో ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఇతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యంత్రంలో ఆకులు కత్తిరిస్తుండగా తెగిపడిన చేయి

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక రాజీవ్‌కాలనీకి చెందిన బాబా యంత్రంలో ఆకులు కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు చేయి పడి పూర్తిగా తెగిపోయింది. హిందూపురం రహదారిలో ఉన్న వేరుసెనగ మిల్లు ఆవరణలో ఆయుర్వేద మందుల తయారీ కోసం సేకరించిన ఆకులను కత్తిరించడానికి యజమాని యంత్రం ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడికి పనులకు వెళ్లిన బాబా ప్రమాదం బారిన పడ్డాడు. క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి హిందూపురం, బెంగళూరు తరలించినట్లు తెలిసింది.

మృతుడు పరిగివాసిగా గుర్తింపు

రొద్దం: మండలంలోని ఎల్‌జీబీనగర్ సమీపంలో ఈత వనం వద్ద దారుణ హత్యకు గురైన వ్యక్తి పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన కురుబ రమేశ్‌గా గుర్తించినట్లు ఎస్సై నరేంద్ర తెలిపారు. ఈ హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు.

రీసర్వేలో సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ, న్యూస్‌టుడే: భూ రీసర్వేలో తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఫ్రీహోల్డ్ రైట్స్ పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మ్యూటేషన్‌కు సంబంధించిన అంశాలపై సూచనలిచ్చారు. అనంతరం పెనుకొండ మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రైతు శివయ్య తన భూసమస్యను పరిష్కరించాలని జేసీకి విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సాయం

గోరంట్ల: మండలంలోని వానవోలు గ్రామంలో పురాతన కస్తూరి రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పెట్లకుంటపల్లివాసి, కర్నూలు జిల్లాలో సీఐగా పనిచేస్తున్న పూల రామకృష్ణ రూ.40,116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

హిందూపురం: స్థానిక ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిహర్షిత జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి తెలిపారు. గుజరాత్‌లో వారం రోజులు జరిగే శిక్షణా తరగతుల్లో ఈమె పాల్గొంటుందన్నారు. విద్యార్థినికి దాతలు సాయం అందించాలని కోరారు.

చరిత్ర ఘనం.. సౌకర్యాలు శూన్యం

◆ గోరంట్ల ఉన్నత పాఠశాలలో సమస్యల తిష్ట

గోరంట్ల, న్యూస్‌టుడే: ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో కనీస వసతులు కొరవడ్డాయి. ఏళ్ల గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 1945లో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. 1986లో బాలురు, బాలికల పాఠశాలలుగా వేరుపడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ 479 మంది విద్యార్థులు, 21 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.


అర్ధాంతరంగా ఆగిన అదనపు గదుల నిర్మాణం

ఉన్నతాధికారులకు విన్నవించాం

ప్రధానంగా గేటు సమస్య, ప్రహరీ, అదనపు గదుల నిర్మాణంపై అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. 200 బస్తాల సిమెంటు ఇండెంట్ ఇచ్చినా రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. సమీప పాఠశాలల నుంచి అరువు తెచ్చి కొంతవరకు పనులు చేయించాం. మెయిన్‌గేటు లేక ఇబ్బంది పడుతున్నాం. విద్యార్థులను కంట్రోలు చేయడం కష్టంగా ఉంది.

\- గోపాల్, ప్రధానోపాధ్యాయుడు

ఇవీ సమస్యలు

● 5.96 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పాఠశాల భవనాలు, క్రీడామైదానం, పెద్దఆవరణ ఉంది. ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో ఎత్తు పెంచి ప్రధాన గేటు ఏర్పాటు కోసం వైకాపా ప్రభుత్వంలో 650 మీటర్ల ప్రహరీ నిర్మాణానికి రూ.32 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. ఎన్ని నిధులు మిగిలి ఉన్నాయో తెలియని పరిస్థితి. అంతేకాదు ఉన్న గేటు తొలగించి ప్రస్తుతం అసలు గేటు లేకుండా చేశారు. దాంతో పాఠశాల ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న దొంగతనాలు జరుగుతున్నట్లు వాపోయారు. ఇటీవలే ఓ దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

● వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు కింద ఎనిమిది అదనపు గదుల నిర్మాణానికి రూ.95 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభమై అర్ధాంతరంగా ఆగిపోయాయి. మరోవైపు పాఠశాలను ప్లస్‌టూగా (ఇంటర్ వరకు) ఉన్నతీకరించారు. ఈ ఏడాది అక్కడ చేరడానికి విద్యార్థులు ముందుకు రాకపోవడంతో ప్రారంభం కాలేదు. వచ్చే ఏడాది ప్రారంభించాల్సి వస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్‌ఎం అంటున్నారు.

● అటెండర్, రాత్రి కాపలాదారు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నైట్‌వాచ్‌మెన్‌గా ఒప్పంద పద్ధతిలో ఒకరిని తీసుకున్నారు. రెండో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టు భర్తీ కావాల్సి ఉంది.

సమావేశానికి అధికారులు గైర్హాజరైతే ఎలా?

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశాలకు ముఖ్య అధికారులు గైర్హాజరైతే ఎలా? అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ గంగమ్మ, ఉపాధ్యక్షురాలు రత్నమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఎంఈవో ఆంజనేయులునాయక్ నిర్వహించారు. వెలుగు ఏపీఎం మదన్‌మోహన్, ఉపాధిహామీ ఏపీవో సోమశేఖర్‌రెడ్డి, జలవనరుల శాఖ ఏఈ రమేశ్, ఐసీడీఎస్ ఏసీడీపీవో గీతాబాయి, గ్రా.నీ.స. ఏఈ మహేశ్, మండల ఇంజినీర్ రవికుమార్, ర.భ ఇన్‌ఛార్జి డీఈ వెంకటేశులు, ఎంఈవో తదితరులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. విద్యుత్తు, రెవెన్యూ అధికారులు రాకపోతే సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని మండల కోఆప్షన్ సభ్యుడు రఫీక్‌సాబ్, ఎంపీటీసీ సభ్యురాలు నందిని, సర్పంచులు నరసింహులు, ఆంజనేయులు నాయక్, నిర్మలమ్మ, రామాంజనేయులు, సోమశేఖర్ తదితరులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల స్థానాల్లో సచివాలయాల సిబ్బంది హాజరు కావడం గమనార్హం. దాంతో కొందరు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. మండల ఉపాధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సంక్షేమానికి కృషి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల సభ్యులు అభివృద్ధి చెందేందుకు తాము కృషి చేస్తామని పట్టణ సమాఖ్యలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పేర్కొన్నారు. పట్టణ సమాఖ్యలకు నూతన కార్యవర్గం ఏర్పాటుకు మెప్మా అధికారులు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. తెలుగు తల్లి పట్టణ సమాఖ్య అధ్యక్షురాలిగా విజయలక్ష్మీ, ఉపాధ్యక్షురాలిగా లలితమ్మ, కార్యదర్శిగా సరస్వతి, సహాయ కార్యదర్శిగా పర్వీన్, కోశాధికారిగా సుజాత, భరతమాత పట్టణ సమాఖ్య అధ్యక్షురాలిగా నలినాక్షి, ఉపాధ్యక్షులుగా వసంత, కార్యదర్శిగా శంకరమ్మ, సహాయ కార్యదర్శిగా భాగ్యలక్ష్మీ, కోశాధికారిగా శివజ్యోతిని ఎన్నుకున్నారు. అనంతరం వారు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును కలిశారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.


మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సమస్యలు పరిష్కారం

స్పందనకు వందనం

గుడిబండ మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను ఈనాడులో 'మేమున్నాం..మీకుతోడుగా' శీర్షికన ప్రచురించడంతో బాధ్యులు స్పందించారు. కురుబరపల్లి పాఠశాల వద్ద ఉన్న నీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొనగా ముతుకూరు పంచాయతీ కార్యదర్శి అమరీశ్ పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. పీసీగిరి ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలను సర్పంచి ఎంజారేగౌడ్ ఏర్పాటు చేయించి అంధకారం తొలగించారు. బీటీపల్లిలో రోడ్డు బురదమయం కాగా ఈఓఆర్డీ నాగరాజు నాయక్ తొలగింపజేశారు. కొంకల్లు ఇందిరమ్మ కాలనీలో సర్పంచి కవిత వీధి దీపాలు ఏర్పాటు చేసి వెలుగులు నింపారు. మందలపల్లిలో దోమల బెడద నివారణకు ఈఓఆర్డీ నాగరాజు నాయక్ ఫాగింగ్ చేయించారు. కేకేపాళ్యం ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపై మురుగు పారుతుండగా పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. బూదిపల్లిలో జమ్మలబండ సర్పంచి నరసమ్మ వీధి దీపాలు ఏర్పాటు చేసి వెలుగులు నింపారు. తిమ్మలాపురంలో తాళికెర సర్పంచి రంగస్వామి తాగునీటి సమస్యను పరిష్కరించారు. –న్యూస్‌టుడే, గుడిబండ

శ్మశానంలో మట్టి తవ్వకాలపై అభ్యంతరం

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలోని యర్రగుంట గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న శ్మశాన వాటికలో కొందరు మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తుండటంతో బుధవారం స్థానిక ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మృతదేహాలను పూడ్చేందుకు ప్రభుత్వం శ్మశాన వాటిక కేటాయిస్తే కొందరు స్వార్థపరులు గోతులు తీస్తూ మట్టి తరలిస్తున్నారని, గోరీలు సైతం దెబ్బతింటున్నాయన్నారు. అక్రమంగా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. దీనిపై ఆర్ఐ సిద్దేశ్వర్ స్పందిస్తూ శ్మశానంలో మట్టి తరలిస్తే ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.


ట్రాక్టరులో మట్టిని నింపుతున్న పొక్లెయిన్

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

అగళి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రామనపల్లి, కోడిపల్లి, అగళి, ఇరిగేపల్లి, నరసంబూది పంచాయతీల్లో నిర్మిస్తున్న కల్వర్టులు, సిమెంటు రహదారుల పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఇరిగేపల్లిలో నూతనంగా తవ్వించిన బోరుబావిలో పుష్కలంగా నీరు రావడంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. రామనపల్లి ప్రాథమిక పాఠశాల వర్షాలకు కారుతుండటంతో విద్యార్థులు పడుతున్న కష్టాలను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ, సర్పంచులు నరసింహమూర్తి, లక్ష్మమ్మ, నాయకులు శ్రీనివాస్, రవికుమార్, గోవిందప్ప, పశువైద్యశాఖ ఏడీ అమర్‌నాథ్, ఎంపీడీఓ యాదవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఇరిగేపల్లిలో బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

ప్రతిభా పోటీలతో మేధకు పదును





హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'అంతర్జాలం వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 10వ తరగతి చదువుతున్న పూజారి ఆదర్శ ప్రథమ, కె.గీతేశ్వరి ద్వితీయ, 9వ తరగతి చదువుతున్న డి.బాబా తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని హెచ్.సుధామణి బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, హిందూపురం

తెదేపాలో చేరిక

మడకశిర గ్రామీణం: మండలంలోని గౌడనహళ్లి పంచాయతీ తురకవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెదేపాలో చేరారు. బుడ్డప్ప, జయరామప్ప, ఫకృద్దీన్, సోమశేఖర్, రామాంజనేయులు, చిత్రశేఖర్, హనుమంతరాయప్పతో పాటు 40 కుటుంబాలు తెదేపాలో చేరారు. వారికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

25న ఉద్యోగమేళా

మడకశిర, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ హేమలత పేర్కొన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా బ్రోచర్‌లను విడుదల చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉద్యోగమేళాలో 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులుగా తెలిపారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివి ఉండాలన్నారు. జీతం రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. బయోడేటా, విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని కోరారు.

చెత్తచెదారం తొలగించరూ



పరిగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న పశుధ్ధజల ప్లాంటు వద్ద చెత్తచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. కొందరు హోటల్ నిర్వాహకులు, దుకాణ దారులు చెత్తను అక్కడ పారబోస్తున్నారు. ఈ విషయాన్ని పరిగి సచివాలయ సహాయ కార్యదర్శి రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగింపజేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పరిగి

సమష్టిగా సమస్యలు పరిష్కరించుకుందాం

లేపాక్షి, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులందరూ ఐక్యంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీపీ వెంకటరత్నమ్మ పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా రాయితీ విత్తనాలు అందించాలని పలువురు సర్పంచులు కోరారు. మండల వ్యాప్తంగా 32 అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ తెలిపారు. త్వరలోనే సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని, 10 చెరువుల మరమ్మతులకు రూ.20 కోట్ల మంజూరైనట్లు ఇరిగేషన్ అధికారి తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి కుళ్లాయప్ప, ఎంఈవో నాగరాజునాయక్, జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, ఏఈలు వెంకటేశ్వర్లు, హనుమేనాయక్, దివ్య, వ్యవసాయాధికారిణి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థినులకు చట్టాల గురించి వివరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రొద్దం, న్యూస్‌టుడే: మహిళలు, బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎస్ఓ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోలీసు అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాలేపల్లి కట్ట కాలువకు గండి

లాలేపల్లి(చిలమత్తూరు), న్యూస్‌టుడే: ఎగువన కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు చిలమత్తూరు ప్రధాన చెరువుకు నీరు వచ్చి చేరుతున్నాయి. అయితే లాలేపల్లి గ్రామ సమీపంలో కట్ట కాలువకు గండి పడటంతో జలాలు వృథాగా పారుతూ కుషావతి నదిలో కలుస్తున్నాయి. గండి పూడ్చివేతకు అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.


వృథాగా పోతున్న నీరు

గుడిబండ: గుడిబండ చెరువుకు గండి పడగా అధికారులు చొరవ తీసుకుని మరమ్మతు చేయించారు. ఎంపీడీఓ గంగాధర్, మైనర్ ఇరిగేషన్ డీఈ తిరుమలేశ్వరరెడ్డి, ఏఈ శ్రీనివాసులు, ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ మట్టితో గండి పూడ్చివేయించారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

గుడిబండ, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం పురస్కరించుకుని గుడిబండ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ పోటీలను పోలీసులు నిర్వహించారు. బాలికల విభాగంలో గుడిబండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినులు గెలుపొందారు. కరికెర కేజీబీవీ విద్యార్థినులు రెండో స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో రవీంద్ర విద్యానికేతన్ విద్యార్థులు విజయం సాధించగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు రన్నర్‌లుగా నిలిచారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, ఎంఈఓ రవిచంద్ర కుమార్, ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప పాల్గొన్నారు. పీడీలు సాయికృష్ణ, అజరుద్దీన్, ప్రకాశ్‌రెడ్డి, గౌరీ, ఉమేశ్‌నాయక్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. నరసింహమూర్తి, రామకృష్ణ, బాలు, ఉపేంద్ర, మోహన్ రెడ్డి స్కోరర్‌లుగా వ్యవహరించారు.


విజేతలుగా నిలిచిన గుడిబండ విద్యార్థినులు

మరువ పారింది.. వరి పొలాలను ముంచెత్తింది

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఆనందపురం పద్మలాపురం చెరువు మరువ పారి వరి పంట పొలాలను ముంచెత్తింది. ప్రస్తుతం పొలాలు చెరువును తలపిస్తున్నాయి. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురువడంతో ఎన్నో ఆశలతో ఆయకట్టు భూముల్లో పేద రైతులు వరి పంట సాగు చేశారు. పొలాలు నీటిలో మునిగిపోవడంతో రైతులు శ్రీరాములు, రామన్న, లక్ష్మన్న, క్రిష్టప్ప, నరసింహప్ప, అంజనప్ప, ఆదెప్ప తదితరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యాన అధికారులు, తెదేపా నాయకులు తదితరులు నీట మునిగిన పొలాలను పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకొన్నారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు మొత్తం 30 ఎకరాల వరకు వరి పంట దెబ్బతిన్నట్లు ప్రభుత్వం, ఉన్నతాధికారులకు నివేదిక పంపించి, నష్ట పరిహారం మంజూరుకు కృషి చేస్తామని తెదేపా మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, ఏవోలు తెలిపారు.


నీట మునిగిన వరి పొలాలు

'పశువుల ఆసుపత్రిలో ఇతర కార్యాలయాలు వద్దు'

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పశువుల ఆసుపత్రిలో ఇతర శాఖల కార్యాలయాలు వద్దని రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో ఇతర కార్యాలయాలు ఏర్పాటు చేస్తే వైద్యం కోసం తీసుకొచ్చే పశువులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, పరిగి నవీన్, రామకృష్ణారెడ్డి, ఆదినారాయణ మాట్లాడారు. పశువుల ఆసుపత్రి ఏర్పాటుకు 110 సంవత్సరాల కిందే దాతలు ఈ స్థలాన్ని విరాళంగా అందించారన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఇతర ప్రాంతాలకు చెందిన పశువులకు వైద్యసేవలు అందించేందుకు ఈ భవనం ఎంతో సదుపాయంగా ఉందని, ఇక్కడ కోర్టులు ఏర్పాటు చేస్తే పశువులకు చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ఆశాఖ అధికారులు ఆలోచించి రైతులకు సహకరించాలని వారు కోరారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

- పురపాలక సంఘం: హిందూపురం
- ప్రాంతం: టీచర్స్‌కాలనీ
- నివాస గృహాలు: 680
- జనాభా: 3,450

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని టీచర్స్ కాలనీలో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. యజమానులు నివాస గృహాలు నిర్మించుకోవాలనే ఉద్దేశంతో అలాగే వదిలేశారు. అందులో విషకీటకాలు, పాములు దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల మురుగు నిల్వ చేరి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. కాలనీలో చెత్తకుండీలు అందుబాటులో లేకపోవడంతో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ చేరుతున్నాయి. ఖాళీ స్థలాల యజమానులు ప్రహరీలు నిర్మించుకోవాలని, పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రంగా ఉంచుకోవాలని గతంలో మున్సిపల్ అధికారులు ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా హౌసింగ్‌బోర్డు, టీచర్స్‌కాలనీలో ఖాళీ స్థలాలను పరిశీలిస్తామన్నారు. యజమానులకు సూచనలు చేసి ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపడతామన్నారు.


శనిమహాత్ముని దేవాలయం వెనుక ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుక

ధర్మవరం, న్యూస్‌టుడే : సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు బుధవారం ధర్మవరంలో ఘనంగా నిర్వహించారు. ప్రభాస్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు, పండ్లు పంపిణీ చేశారు. కేక్ కోసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఆ సంఘం నాయకులు సుధాకర్, మణి, షాహిద్, తేజ, ఆషు, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం పట్టణ అధ్యక్షుడు రామాంజి, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.


కేక్ కోస్తున్న ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు

కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హర్యాన్‌చెరువు గ్రామంలో సోమవారం రాత్రి వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను వారు తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ ఉదయ్‌కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. మండలంలో వరి, వేరుసెనగ దెబ్బతిన్న ఇతర పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరి, వేరుసెనగ, టమాటా, ఇతర కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని, వాటి వివరాలను రైతు సేవా కేంద్రాల సిబ్బంది నమోదు చేస్తున్నారన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రంగయ్య, మాజీ ఎంపీపీ అమరేంద్ర, నాయకులు రాజు, ముత్యాలు, బాధిత రైతులు పాల్గొన్నారు.

మహిళా శక్తి.. ఆర్థిక ప్రగతి

కదిరి, పుట్టపర్తి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : చిన్నమొత్తాల పొదుపుతో.. పెద్దమొత్తాలను కూడబెట్టి స్వయంశక్తి సంఘాలుగా మహిళలు ఎదుగుతున్నారు. చిరు వ్యాపారాలు, చేతి వృత్తులతోపాటు తినుబండారాల తయారీతో లాభాల బాటలో పయనిస్తున్నారు. తాము చేపట్టిన ఉత్పత్తులతో పలువురికి ఉపాధి పంచుతున్నారు. ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. దిన కూలీలుగా మగ్గాల వద్ద పనులు చేసిన వారు నేడు ప్రస్తుతం స్వయం ఉపాధితో పలువురి జీవనోపాధికి ఊతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి, గొర్రెల పెంపకం, ఆకుకూరలు, కూరగాయల అమ్మకంతో ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారు. పట్టణాల్లో తినుబండారాల తయారీ, రెడీమేడ్ దుస్తులు, తోపుడు బండ్లపై పండ్ల అమ్మకం వంటి వ్యాపారాలతో ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నారు. మెరుగైన కుటుంబ జీవనం, పిల్లలను విద్యా వంతులుగా తీర్చిదిద్దుతూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు.

ఉపాధికి ఊతం.. మెరుగైన జీవితం

కదిరి మెప్మా కింద పట్టణ పేదలు పొదుపు సభ్యులుగా ఏర్పడిన 1,630 సంఘాలు ఉన్నాయి. వీరికి ఏటా రూ.70 నుంచి రూ.80 కోట్ల మేర బ్యాంకు రుణాలను అందిస్తున్నారు. ఇందులో చాలామంది ఆహార ఉత్పత్తుల మార్కెటింగ్‌ను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. ఇలాంటి సంఘాలు సుమారు 308 పైగా ఉన్నాయి. అలా ఉపాధి పొందుతూ.. ఆదాయాన్ని పెంచుతున్న 'ప్రశాంతి సంఘం' సభ్యులు షేక్ ఆబిద్ చిన్నపిల్లలు ఇష్టపడే తినుబండారాల తయారీని ఎంచుకున్నారు. ప్రతి నెలా రూ.1.40 లక్షల మేర వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తున్నారు. తాను సంపాదిస్తూనే మరో 9మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. వీరిలో మహిళలకు రూ.300, పురుషులకు రూ.500 మేర రోజుకూలీతో ఉపాధిని కల్పిస్తున్నారు. తయారు చేసిన ఉత్పత్తులను వివిధ ప్రాంతాల వారు తయారీ కేంద్రం వద్దకే వచ్చి తీసుకెళ్తున్నారు. ఇలా పెట్టుబడులు, కూలీలు, ఖర్చులు పోనూ సగటున నెలకు రూ.40 వేల దాకా మిగులు ఆదాయం పొందుతున్నారు. అయితే సభ్యులు పొందిన రుణాలను ఎంచుకున్న వ్యాపారంపై పెట్టి శ్రద్ధతో కష్టపడితే ఉపాధి కొదవ ఉండదని షేక్ ఆబిద్ చెబుతున్నారు.


తిను బండారాల తయారీలో పొదుపు మహిళలు

పొదుపుసంఘం సభ్యుల అభివృద్ధి బాట..

ఆకుకూరల సాగుతో ఆదాయం..

పుట్టపర్తిలోని దొమ్మరికాలనీలోని ఈశ్వరీ సంఘంలో సభ్యురాలుగా సుజాత ఉన్నారు. సంఘ సభ్యురాలిగా రూ.50 వేల రుణం పొంది.. పుట్టపర్తికి సమీపంలో కొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. రుణంతోనే కొత్తిమీర, మెంతాకు, గోంగూర, పలకలాకు వంటి ఆకుకూరల సాగు చేపట్టారు. ఉదయం ఐదు గంటలకే ఆకు కూరలు తీసుకుని పుట్టపర్తికి వెళ్లి విక్రయిస్తున్నారామె. రోజుకు రూ.400 నుంచి రూ.500 సంపాదిస్తున్నారు. ఆమె పిల్లల్లో ఒకరు పదో తరగతి, మరొకరు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఆమె తనవంతుగా భర్తకు తోడుగా నిలుస్తున్నారు. సాయంత్రం ఆకు కూరలు కోయటం, ఉదయాన్నే ఐదు గంటలకు ఇంటింటికీ వెళ్లి అమ్ముకోవటం ద్వారా ఎలాంటి నష్టం లేకుండా ఆదాయం పొందుతున్నట్లు ఆమె పేర్కొంటున్నారు.


ఆకుకూరల సాగులో సుజాత

కుట్టుతో ఆర్థిక స్వావలంబన

రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి తాడిమర్రి చెందిన తలారి ఓబులేశు, శివమ్మ దంపతులది. ఓబులేశు బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబ పోషణలో భర్తకు అండగా నిలవాలని భార్య శివమ్మ భావించింది. కుట్టుమిషన్ నేర్చుకుందామె. సాయిశ్రీ సంఘంలో సభ్యురాలుగా చేరి కుట్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఏటా తిరిగేసరికి మహిళల దుస్తులు కుట్టడంలో నైపుణ్యం సాధించి.. మంచి పేరు తెచ్చుకున్నారు. తీసుకున్న రుణం తీర్చడం. తిరిగి తీసుకోవడం చేస్తూ ముందుకెళ్తున్నారామె. ఆర్థికాభివృద్ధి సాధించారు. ఇద్దరిని ఇంజినీరింగ్ చదివించి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలలో స్థిరపడేలా చేసిందామె.


మిషన్ కుడుతున్న శివమ్మ

తెదేపా సభ్యత్వ నమోదుకు కృషి

ధర్మవరం, న్యూస్‌టుడే : తెదేపా సభ్యత్వ నమోదులో ధర్మవరం నియోజకవర్గాన్ని ముందు వరుసలో ఉండేలా చేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. గ్రామ, వార్డుల్లో సభ్యత్వ నమోదు చేయించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కమతం కాటమయ్య, జడ్పీ మాజీ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, రమేశ్‌బాబు, తెదేపా పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్





ప్రతిభకు ప్రోత్సాహం

'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని సాధన ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పది, తొమ్మిది, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎం.మనోజ్ఞ, బి.ఉదయ్ సాయిరాం, బి.హన్సిక, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి బహుమతులు, ధ్రువపత్రాలను పాఠశాల కరస్పాండెంటు సీతాపతిరావు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'ఈనాడు' చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భువనేశ్వరి, కుళ్లాయమ్మ, వాసవి పాల్గొన్నారు.

పోటీలతో ప్రతిభ గుర్తింపు

కదిరి, న్యూస్‌టుడే : పోటీల్లో పాల్గొని మేటిగా నిలవటంతోనే ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని కుటాగుళ్ల లోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం కదిరి పట్టణంలోని ఆ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ నష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన తొమ్మిదో తరగతి ఎం.రతీబ్‌ఖాన్, పదో తరగతి ఎ.ఉజ్వల్, ఎస్.నీహాలు వరుసగా మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయిని బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, నారాయణస్వామి, నాగరాజు, రమాదేవి, హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : ఎరుకులవాండ్లపల్లిలో తాగు నీటి ట్యాంకు కుళాయిలు విరిగి పోవడంతో నీటి వృథా అరికట్టాలని కర్ర పెట్టారు. దీంతో నీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కుళాయిలు ఏర్పాటు చేయాలి.
- వెంకటేశ్, ఎరుకులవాండ్లపల్లి

సమస్య : ఎరుకులవాండ్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి మలుపులో మురుగు చేరడంతో రాక పోకలకు ఇబ్బందిగా ఉంది.
- గంగులప్ప, ఎరుకులవాండ్లపల్లి.

సమాధానం : తాగు నీటి ట్యాంకుకు అవసరమైన కుళాయిలు ఏర్పాటు చేస్తాం. ప్రధాన రహదారిలో మురుగు నిల్వ చేరకుండా పొక్లెయిన్‌తో పనులు చేపడతాం.
(పై సమస్యలకు యర్రదొడ్డి పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ సమాధానం ఇచ్చారు.) – న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

27న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు

కదిరి, న్యూస్‌టుడే : ఈ నెల 27న కదిరిలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, నరసారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కదిరిలోని అనంతపురం వెళ్లే మార్గంలోని సాధన పాఠశాలలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులో విజేతలైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



పుట్టపర్తి: పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాయంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా **మహేశ** బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఆయన ఇంటెలిజెన్స్ విభాగం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మర్యాద పూర్వకంగా ఎస్పీ రత్నను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రేషన్ దుకాణాల తూకాలు తనిఖీ

కొత్తచెరువు: కొత్తచెరువు మండలంలోని ప్రభుత్వ చౌకధరల దుకాణాల తూనికలు, కొలతల పరికరాలను తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ బుధవారం తనిఖీ చేసి వాటిని ధ్రువీకరించారు. మండలంలోని 38 దుకాణాల ఎలక్ట్రానిక్ తూకం పరికరాలను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పరీక్షించారు. లోపాలున్న పరికరాలను సరిచేసి సీల్ వేశారు.

రాకపోకలు బంద్

ధర్మవరం: మండలంలోని గొట్లూరు చెరువు నిండి మరువ నుంచి నీటి ప్రవాహం భారీగా వస్తోంది. గొట్లూరు - తుమ్మల ప్రధాన రహదారిపై నీరు వెళుతోంది. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు జరగకుండా బుధవారం ధర్మవరం గ్రామీణ ఎస్ఐ శ్రీనివాసులు పర్యవేక్షించారు. రహదారిపై నీరు అధికంగా ప్రవహిస్తున్నప్పుడు వెళితే ప్రమాదం బారిన పడే పరిస్థితి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. నీటిప్రవాహం తగ్గేంత వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కార్మికుల కుటుంబాలను ఆదుకోండి

ధర్మవరం పట్టణం: కరోనా సమయంలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన కార్మికులకు పరిహారం అందజేసి, వారి కుటుంబానికి ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండు చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు జేవీ రమణ, నాయకులు అయూబ్‌ఖాన్, బాబు, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో నసనకోట విద్యార్థికి కాంస్య పతకం

రామగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అక్టోబరులో గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి జూడో పోటీలలో 25 కేజీల విభాగంలో నసనకోట ఉన్నత పాఠశాల విద్యార్థి జయసింహ కాంస్య పతకం సాధించడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జయసింహాను సత్కరించి, గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని నాగరత్న, పీడీ చామంతి తదితరులు పాల్గొన్నారు.

బాబా జయంతికి ఏర్పాట్లు చేయండి

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వచ్చే నెలలో సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో పుట్టపర్తిలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే పల్లె సింధూర ఆదేశించారు. ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో చేపట్టబోయే పనులపై కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని కమిషనర్‌కు సూచించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. బుధవారం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఉన్న ఆదాయ మార్గాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుట్టపర్తి అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దన్నారు. మున్సిపాలిటీలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఎండీఎఫ్ కింద మంజూరైన రూ.1.50 కోట్లు ఖర్చు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పుడా నుంచి విడుదలైన రూ.కోటి, గడప గడప కార్యక్రమం నిధులు రూ.కోటి, డీఎంఏ నుంచి విడుదలైన రూ.76 లక్షలు సద్వినియోగం చేసుకోకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ తిప్పన్న, తెదేపా ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి, కౌన్సిలర్లు లక్ష్మీపతి, సూర్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, సాయిగీతా, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద ఏఈ స్వాతి, పారిశుద్ధ్య అధికారి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ఎమ్మెల్యే సంతాపం: పుట్టపర్తి పట్టణం: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని యనుములపల్లిలో భాజపా నాయకుడు సూర్యనారాయణ మాతృమూర్తి వసుంధర మృతి చెందిన విషయం తెలిసిన ఎమ్మెల్యే సింధూర రెడ్డి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. భౌతికకాయానికి నివాళులర్పించి ఆ కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు.

తాత్కాలికంగా మట్టితో గుంత పూడ్చివేత

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లి కాలనీలో నడిరోడ్డుపై పడిన గుంతను మట్టితో పూడ్చి తాత్కాలిక చర్యలు చేపట్టారు. 'ఇలా మడుగు.. వేసేదెలా అడుగు' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. వర్షం నీరు బయటకు వెళ్లే వీలులేక రోజుల తరబడి అక్కడే నిలవడంతో అపరిశుభ్రత నెలకొంది. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లతో మట్టిని తరలించి తాత్కాలిక చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి నరేశ్ తెలిపారు. గ్రామీణ ఉపాధి పథకం కింద సీసీ రోడ్డు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఉన్నతాధికారులకు నివేదించామని కార్యదర్శి తెలిపారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

ధర్మవరం పట్టణం : పట్టణంలో మున్సిపల్ శాఖకు బకాయి పడ్డ పన్నులను సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. గతంలో కొందరు అధికారులు ఆస్తి పన్నులను తక్కువగా వేసి మున్సిపాలిటీ ఆదాయం తగ్గేలా చేశారని, వీటిపై పునఃసమీక్ష చేయాలని రెవెన్యూ విభాగం సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిదారులకు నోటీసులు పంపి, వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కుంటిమద్దిలో ఎమ్మెల్యేకి రైతుల మొర

రామగిరి, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం అర్ధ రాత్రి కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలు, నష్టపోయిన రైతుల వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందించాలని వ్యవసాయ అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రామగిరి మండలం కుంటిమద్ది, శ్రీహరిపురం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే, వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించారు. పలువురు రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగుచేస్తే నేల పాలైందని ఆవేదన వ్యక్తం చేయడంతో వారిని ఎమ్మెల్యే ఓదార్చారు. నష్టపోయిన ప్రతి ఎకరం వివరాలు వాటి విలువ అంచనా వేయాలన్నారు.


తడిచిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

బాధ్యులపై చర్యలకు డిమాండ్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన పోలీసులను అరెస్టు చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు బుధవారం కదిరి గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు. ప్రేమపెళ్లి వ్యవహారంలో పోలీసుల వేధింపుల తాళలేక సూసైడ్ నోట్ రాసిన ఉదయ్‌కుమార్ గత నెల 27న యర్రదొడ్డి సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ కుమారుడి ఆత్మహత్యకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నెలరోజులు కావస్తున్న పోస్టుమార్టం నివేదిక, ఎఫ్ఐఆర్ కాపీలను కూడా ఇవ్వలేదన్నారు. ఆత్మహత్యకు కారణమైన పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న బాధితుడి కుటుంబసభ్యులు

'తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి'

పుట్టపర్తి గ్రామీణం: హైకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకుని తొలగించిన వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం, సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. జిల్లాలో వీఓఏల అక్రమ తొలగింపు సరైంది కాదని వారిని యథావిధిగా విధుల్లో కొనసాగించాలని మంగళవారం హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వండపై వారు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో సంబంధిత కోర్టు ఉత్తర్వుల ప్రతిని పీడీ నరసయ్యకు అందజేసి న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, వీఓఏలు రంగేనాయక్, సుజాత, అశ్విని, భార్గవి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్ చంద్రశేఖర్ తల్లిని పరామర్శిస్తున్న ఎస్పీ రత్న

అమరవీరుని కుటుంబానికి ఎస్పీ పరామర్శ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పోలీస్ అమరవీరుల దినోత్సవాల్లో భాగంగా నక్సలైట్ల కాల్పుల్లో మృతి చెందిన కానిస్టేబుల్ చంద్రశేఖర్ కుటుంబాన్ని బుధవారం బీడుపల్లిలో జిల్లా ఎస్పీ రత్న పరామర్శించారు. 1993లో పోలీస్ ఉద్యోగంలో చేరిన చంద్రశేఖర్ 2003లో రామగిరి పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహిస్తుండగా నక్సలైట్ల కాల్పుల్లో మృతి చెందారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఏ పని ఉన్నా తనను నేరుగా కలవచ్చని ఎస్పీ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఎస్పీ వెంట పుట్టపర్తి డి.ఎస్పీ విజయ్ కుమార్, సీఐ సునీత సిబ్బంది ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

కదిరి పట్టణం: కదిరి మండలం కొండమనాయునిపాళ్లెం చెందిన వివాహిత రోషిణి (21) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొండకమర్లకు చెందిన ఆమెకు కొండమనాయునిపాళ్లెం చెందిన షాన్‌వాజ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బుధవారం రోషిణి పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వివాహిత మృతి విషయాన్ని కదిరి గ్రామీణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. దర్యాప్తులో ఆత్మహత్యకు గలకారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలియచేశారు.

మద్యం మత్తులో కుమారుడిపై దాడి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : మద్యం మత్తులో కుమారుడిపై తండ్రి దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు. కదిరి మండలం కె.కుంట్లపల్లికి చెందిన శ్రీరాములు మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. బుధవారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శ్రీరాములు, కుమారుడు అశోక్‌కుమార్‌పై దాడిచేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన కోడలి, భార్యను దుర్భాషలాడాడు. గాయపడిన అశోక్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు కదిరి గ్రామీణ పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని గాయాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి పట్టణం నిజాంవలికాలనీ సమీపంలో ఆటోఢీకొని అదే ప్రాంతానికి చెందిన సాంబశివ గాయపడ్డారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు. సాంబశివ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్నాడు. బుధవారం రాత్రి రోడ్డు దాటే సమయంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో సాంబశివ కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కోటపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మాజీ వాలంటీరు కార్తీక్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. బుధవారం తనిఖీలు నిర్వహించి ఇంట్లో మద్యం విక్రస్తున్నట్లు గుర్తించామన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 184 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ వివరించారు.


రాకపోకలకు అవస్థ

ధర్మవరం మండలం గొల్లపల్లి వాగుకు భారీగా వర్షం నీటి ప్రవాహం రావడంతో ధర్మవరం - గొల్లపల్లి వెళ్లే రహదారి కోతకు గురైంది. నీటి ప్రవాహానికి రహదారి కోసుకుపోయి రాళ్లు తేలాయి. భారీ వృక్షం నీటిలో కొట్టుకొచ్చి రహదారిపై నిలిచింది. రోడ్డు దెబ్బతినడం, చెట్టు అడ్డుగా ఉండటంతో గొల్లపల్లి నుంచి ధర్మవరానికి ఈ మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. మరో మార్గం గుండా గొల్లపల్లి వాసులు పట్టణంలోకి రాకపోకలు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం**



అల్లుకున్న నిర్లక్ష్యం

బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి బస్టాండ్ సమీపాన 11 కేవీ విద్యుత్తు స్తంభానికి చెట్ల తీగలు అల్లుకొని తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం జరుగుతోంది. చెట్ల తీగతలకు విద్యుత్తు సరఫరా అవుతుండటంతో పొలంలోకి వెళ్లొచ్చే రైతులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్తు శాఖ ఏఈ శివయ్య దృష్టికి తీసుకెళ్లగా చెట్ల తీగలు తొలగిస్తామని చెప్పారు.
- న్యూస్‌టుడే, బత్తలపల్లి





చోదకులకు చింత

ధర్మవరంలోని శ్మాశాన వాటిక వద్ద ప్రధాన రహదారి మలుపులో గుంత ప్రమాదకరంగా ఉంది. వారం రోజులు నుంచి కురిసిన వర్షానికి గుంత చుట్టూ తారులేచిపోవడంతో పెద్దదిగా మారింది. దీంతో చోదకులు రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారు. సమస్యను ర.భ. శాఖ డీఈ నాగపుల్లంరావు దృష్టికి తీసుకెళ్లగా గుంతలను పూడ్చివేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

ప్రమాద మలుపు

మండలంలోని దొరిగల్లు నుంచి చిన్నకోట్లకు వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందుకూరు, మర్తాడు, కొడవండ్లపల్లి, బూదనాంపల్లి, రాఘవపల్లి, యర్రగుంటపల్లి గ్రామాల సమీపంలో సూచికబోర్డుల్లేక మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ఏపుగా పెరిగిన కంపచెట్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, ముదిగుబ్బ**

